రెడ్ బాక్స్

సుంకరి రాంప్రసాద్

(గత సంచిక తరువాయి)

10

సుమారు ఆరడుగుల ఎత్తుఉంది ఆ జీవి.

నల్లగా మెరుస్తున్న గుండ్రని శరీర ఆకృతి, పొడవాటి పది కాళ్ళు. కీటకాలకు మల్లే మడిచి పెట్టబడిఉన్న దాని కాళ్ళు ఒక్కొక్కటి సుమారు ఆరేడడుగుల పొడవు ఉంటాయి. ముందుకు పొడచుకు వచ్చినట్లు కన్పిస్తున్న తలలో ఎర్రని మిడిగుడ్లు మరింత భయంకరంగా కన్పిస్తున్నాయి.

సాలెపురుగు ఆకారాన్ని పోలివున్న అలాంటి విచిత్ర జీవిని, మును పెన్నడూ వారు చూసివుండలేదు. ఎప్పుడో చదివిన 'ట్వంటీ థౌజండ్ లీగ్స్ అండర్ ద సీ' అనే నవలలో జూల్స్ వెర్న్ చే అభివర్ణింపబడ్డ 'సీ స్పైడర్' గుర్తుకు వచ్చింది శివాజీకి.

"అంటే ఈ విచిత్రజీవి సీ స్పైడరా?" భయంతో వణికిపోతూ దానివంక చూస్తోన్నారు వారిద్దరూ.

దాని ముందరి రెండు కాళ్ళమధ్య చిక్కుపడివున్నాడు చౌహాన్. కేన్సర్ డెక్కల్లా వున్న దాని ముందరికాలి చివర్లు పట్టకార్లలా అతని దేహాన్ని పట్టివున్నాయి. అప్పటికే దాదాపుగా మోకాళ్ళదాకా అతడిని మ్రింగేసింది ఆ జీవి. మెల్లగా దవడలను కదిలిస్తూ, కర కరా అతని కాళ్ళను నములసాగింది అది.

భరించలేని బాధతో కెవ్వున అరుస్తూ, గిలగిలా కొట్టుకుంటున్నాడు చౌహాన్.

'ఎలా తమ సహచరుని రక్షించుకోవడం?' వారు అసహనంగా చుట్టూ చూస్తున్నారు. 'కనీసం పొడవాటి ఐరన్ రాడ్ లాంటి దేదయినా దొరక్కపోతుందా?' అని.

ఒక్కక్షణంపాటు చుట్టూ కలియచూసి, నిరాశగా తల విదిలించాడు శివాజీ. ఏదో నిశ్చయానికి వచ్చినట్లు ముందుకు అడుగువేశాడు. చటుక్కున అతని భుజాన్ని పట్టి ఆపాడు పండిట్.

ఏం చేద్దామని అన్నట్లుంది అతని చూపు. ఇద్దరూ ఒకరినొకరు సాభిప్రాయంగా చూసుకున్నారు.

నిజమే! ఏం చేద్దామని!

చేతిలో కనీసం ఐరన్ రాడ్ లాంటి ఆయుధమైనా లేకుండా, సీ స్పైడర్ లాంటి జీవిని ఎలా ఎదుర్కొందామని? వట్టి చేతులతో ఆ జలరాక్షసునికి ఎదురునిలవటం సాధ్యమయ్యే పనేనా?

అయితే యిక్కడ సమస్య....అది సాధ్యమవుతుందా, కాదా అన్నది కాదు. అక్కడ ఒక నేస్తం

ప్రాణం ప్రమాదంలో ఉంది. అతని ప్రాణాన్ని రక్షించడం కోసం తన ప్రాణాన్ని పణంగా ఒడ్డితే సరి?

పండిట్ చేతిని సాభిప్రాయంగా నొక్కి ముందుకు అడుగువేశాడు శివాజీ.

అంతలో....

ఒక్కసారిగా అక్కడి నీళ్ళు, కల్లోలంగా ఎగిసి పడ్డాయి. నీళ్ళను చీల్చుకుంటూ ఒక నల్లని ఆకారం దూసుకుంటూ వచ్చింది.

"మైగాడ్! ఎనదర్ సీ స్పైడర్!" పాలిపోయిన ముఖాలతో ఆ ఆకారం వంక చూస్తూ మెల్లగా గొణుక్కున్నారు వారు.

రెండవ సీ స్పైడర్ రివ్వున దూసుకుంటూ వచ్చి, మొదటి సీ స్పైడర్‌ను సమీపించింది. వస్తూ వస్తూనే మొదటి సీస్పైడర్ నోటిలో గింజుకుంటున్న చౌహాన్ తలను ఛటుక్కున, ముందరికాలి డెక్కలతో అందుకొంది.

ఆ డెక్కల వత్తిడికి, చౌహాన్ కంఠనాళాలు తెగిపోయాయి. కొనవూపిరితో నిస్సహాయంగా గిజగిజ లాడుతున్న అతన్ని చూసాక శివాజీకి మరి అడుగులు ముందుకు పడలేదు. అతనికి తెలుసు యిక ప్రపంచంలోని యే శక్తి తమ స్నేహితుని ప్రాణాలను రక్షించలేదని. మరో రెండు క్షణాలు. అంతే!

బాధగా తల విదిలించి, ఆ భయానక దృశ్యాన్ని చూడలేక ముఖాన్ని ప్రక్కకు తిప్పుకున్నాడు. జీవం యింకిన కళ్ళతో నిస్తేజంగా చూస్తూ నిలబడివున్నాడు పండిట్.

రెండు సీస్పైడర్ల మధ్యా పెనుగులాట ప్రారంభ

మయింది. చావుకూ, బ్రతుకుకూ మధ్య ఊగిసలాడుతున్న చౌహాన్ శరీరం ఆ రెండు జీవుల మధ్యా నలిగి పోతూంది.

ఇక ఆ దృశ్యాన్ని చూసి, భరించలేక గిరుక్కున వెనుతిరిగి, పండిట్ భుజాన్ని తడుతూ డెన్‌లోకి నడిచాడు శివాజీ.

స్నేహితుని దక్కించుకోవడం అసాధ్యమని తేలాక కనీసం ఆ అమూల్య సంపదనైనా చేజిక్కించుకుందామనే ఆశతో వారు వెనుతిరిగారు.

నిజమే! ప్రాణాలకు తెగించి మరీ ఈ సాహసకార్యానికి పూనుకున్న వారికి తమకన్నా తమ ప్రాణాలకన్నా దేశం ముఖ్యం! దేశస్వాతంత్ర్య సాధనకు అవసరమయిన ఆ అమూల్య సంపద ముఖ్యం.

వారు డెన్‌లో ప్రవేశించారు. అప్పటికే, ఉబికి వస్తోన్న నీళ్ళతో డెన్ దాదాపుగా నిండిపోయింది. ఓ మూలనున్న రెయిలింగ్స్‌లో చివరి మూడు నాలుగు మెట్లు మాత్రం నీళ్ళ అంచులపై నుండి కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. వారు ఈదుకుంటూ ఆ మెట్లను సమీపించారు....

అదృష్టం! నీళ్ళు ముంచెత్తినా, ఆ మెట్లపై పెట్టబడ్డ ఆ పెట్టె భద్రంగానే వుంది. డెన్ ద్వారంగుండా, పెట్టెను మోసుకొంటూ బయటకు వచ్చారు. అప్పటికి డెక్ ఉపరితలం, సముద్ర మట్టం రెంటూ కలిసిపోయి వున్నాయి.

డెక్‌పై నిలుచుని ఒక్కసారి చుట్టూ కలియజూశాడు శివాజీ. క్షణానికో అంగుళం చొప్పున సముద్రంలో మునిగిపోతూంది షిప్ ఎలిజబెత్.

అతని కళ్ళల్లో చెప్పలేనంత కలవరం!

అయితే అతడు కలవరపడుతున్నది మునిగిపోతున్న షిప్ గురించి కాదు. నింగి అంచుల నుండి సముద్రంపైకి ముంచెత్తుక వస్తున్న కారుమేఘాలను చూసి.

ఆకాశపు టడవిలో పరుగులు తీస్తున్న మత్తగజాల్లా వున్నాయి ఆ కారుమబ్బులు. కడలి తలంపై అన్ని కారు మబ్బులు కమ్ముకున్నాయంటే, జరగబోయేదేమిటో అతనికి తెలియంది కాదు.

కుంభవృష్టి!

కుంభవృష్టి కురవబోతోంది.

పండిట్ వంక ఒక్కసారి సాలోచనగా చూసి, ముందుకు పరుగెత్తాడు శివాజీ. అతన్ని అనుసరించాడు పండిట్. వారిద్దరి చేతుల మధ్యా బరువుగా వేలాడుతోంది అపూర్వ సంపదను తన పొట్టలో దాచుకున్న ఆ పెట్టె.

డెక్ అంచుకు చేరుకున్నాక, యిద్దరూ కూడబలుక్కొని సముద్రంలోనికి ఒక్కసారి దూకేశారు. తీరంవైపు ఈదటం ప్రారంభించారు.

అటు పోటులతో నున్న సముద్రంలో చెరివొకవైపు బరువైన ఆ పెట్టెను పట్టుకొని, ఒంటిచేత్తో ఈదటమంటే మాటలతో చెప్పినంత సులువేం కాదు.

అతి కష్టంమీద వారు తీరాన్ని చేరుకోగల్గారు. అయితే, ఉధృతంగా వున్న సముద్ర కెరటాల తాకిడికి, తమ పడవను ఆపివుంచిన తీరానికి కాక, మరో దిశకు చేరుకున్నారు.

ఆయాసంతో వగరుస్తూ, ఇసుకలో కూలబడ్డారు.

“వర్షం వచ్చేటట్లుంది. ఏం చేద్దాం శివాజీ....?”

ఆకాశంకేసి అలజడిగా చూస్తూ అడిగాడు పండిట్.

తాము ఎక్కివచ్చిన సరుకుల నౌకను దగ్ధం చేసే ముందు ఒక లైఫ్ బోటును తీరంలో ఒకచోట దాచి వుంచారు వారు. తమ తిరుగుప్రయాణానికి కావాల్సిన ఆహారం, నీరు ఆ బోటులో పెట్టి వుంచారు.

"ముందు ఆ బోటును చేరుకోవాలి. దానిలోనికి ఈ పెట్టెను చేర్చాలి. అప్పుడు కదా ప్రయాణ విషయం. చూద్దాం!" అన్నాడు శివాజీ నిదానంగా.

అయితే, ఓ ప్రక్క సంశయంగానే వుంది. కుంభవృష్టి కురిసే సూచనలున్న ఈ వాతావరణంలో ఆ చిన్న బోటును నమ్ముకుని, అనంతమైన కడలిలో అంత ప్రయాణం చేయటం ఎంతవరకూ క్షేమకరం!

"పోనీ యీ రాత్రికి ఈ దీవిలోనే విశ్రాంతి తీసుకొని, సూర్యోదయమయ్యాక, వాతావరణం కాస్త తెరపినిచ్చాక ప్రయాణం సాగిస్తే....!"

—పండిట్ ఆలోచిస్తున్నది కూడా సరిగ్గా ఇదే!

అయితే, శివాజీ యింకాస్త ముందుకుపోయి, ఆలోచిస్తోన్నాడు. 'ఒకవేళ షిప్ ఎలిజబెత్‌కు అండోత్ దీవి తీరంలో ప్రమాదం వాటిల్లిందని తెలిసి, బ్రిటిష్ అధికారులు ఈ దీవికి సెర్చింగ్ పార్టీని పంపిస్తే....అప్పుడు తామింకా ఈ దీవిలోనే విశ్రాంతి తీసుకుంటూ కూర్చుంటే....' ఆ పైన ఆలోచించలేక తల విదిలించాడు.

అతని సిక్స్త్ సెన్స్ గట్టిగా చెబుతూంది....అతని అనుమానం నిజం కాబోతుందని. అందుకే ఎంత ప్రమాదమయినా ఆ క్షణమే ఆ దీవిని విడిచి వెళ్ళిపోదామని అనిపించసాగింది అతనికి.

అదే క్షణంలో తన కాలిని ఏదో పట్టి లాగుతున్నట్లయ్యేసరికి, ఉలిక్కిపడి చూశాడతడు.

పాదం దగ్గర ఏదో నల్లని ఆకారం కాలి బూటును కొరకడానికి ప్రయత్నిస్తూంది. లాగిపెట్టి తన్నాడతడు. కీచుమంటూ అరుస్తూ ఎగిరి ఆరడుగుల దూరంలో పడిందది. ఒక్క ఉదుటున లేచివెళ్ళి ఆ ఆకారాన్ని సమీపించారు వారు.

చిన్న సైజు పందిపిల్లలా ఉంది అది. నల్లని దేహంపై తెల్లని పొడలు. చూడటానికి పరమ అసహ్యకరంగా ఉంది. పొడుగాటి దాని తోకను చూస్తూనే అదేమిటో గ్రహించాడు శివాజీ.

"పందికొక్కు!" అన్నాడతడు ఆశ్చర్యంగా దాని తెల్లని పొడలను చూస్తూ.

తెల్లని కోరలను పైకి చూస్తూ, కీచుగా అరుస్తూ పారిపోవడానికి ప్రయత్నించింది ఆ పందికొక్కు.

ఛటుక్కున వంగి నేలపైనున్న చిన్న రాయినితీసి, బలంగా దానివైపు విసిరాడు పండిట్. నున్నగా, క్రికెట్ బాల్ సైజులో వుంది అతడు విసిరిన రాయి. సూటిగా పోయి ఆ పందికొక్కు తలకు తగిలిందది. అంతే తల చితికి, గిల, గిల కొట్టుకుంటూ చచ్చిపోయిందది. చిందిన ఎర్రని రక్తంతో మరింత అసహ్యంగా కన్పిస్తున్న దాని వంక చూడలేక వెనుతిరిగారు వారు.

"పండిట్! తెల్లటి పొడలతో ఉండే అలాంటి పంది కొక్కు కరిచిందంటే ప్లేగు వ్యాధి వస్తుంది. తెలుసా?" అన్నాడు శివాజీ.

"అయితే, అలాంటి పందికొక్కుల్ని పట్టి ఇండియా లోని తెల్లదొరల ఇళ్ళలో వదిలేస్తే సరి!" అన్నాడు

పండిట్.

చిన్నగా నవ్వుకున్నారు వారు.

అయితే, ఒక్కసారిగా వినవచ్చిన యేవో విచిత్ర ధ్వనులకు, వారు వెనుతిరిగి చూసారు.

అంతే!

ఎదురుగా కనిపిస్తున్న ఆ దృశ్యాన్ని చూసేసరికి వారి పెదవులమీది చిరునవ్వులు అంతరించిపోయాయి. భయంతో వారి ముఖాలు తెల్లగా పాలిపోయాయి.

'ఆ రాత్రికి ఆ దీవిలో వుండి విశ్రాంతి తీసుకుందామనే' ఆలోచన ఏమైనా వారి మనసుల్లో మిగిలి వుంటే అది ఆ క్షణమే పటాపంచలైంది.

చచ్చిపడివున్న ఆ పందికొక్కును పీక్కుతింటున్నాయి మరికొన్ని పందికొక్కులు. దాని పచ్చిరక్తపు వాసన సముద్రపుగాలికి కొట్టుకువస్తోంది. ఆ వాసన సోకి కాబోలు....ఎక్కడినుండో గుంపులు గుంపులుగా వచ్చి పడుతున్నాయి లెక్కలేనన్ని పందికొక్కులు.

వందలు, వందలు....ఊహుఁ....వేలల్లో వుంటుంది వాటి సంఖ్య. మందలుగా వచ్చి పడుతున్న ఆ పందికొక్కులను చూసేసరికి భయంతో కంపించిపోయారు వారు.

"ఖర్మకాలి వాటిమధ్యలో తాము చిక్కుపడితే..." ఆ ఆలోచన రావటమే తడవుగా చిగురుటాకుల్లా కంపించిపోయాయి వారి మేనులు.

"లెటజ్ గెట్ అవుటాఫ్ ద హెల్ హియర్ పండిట్! కమాన్ క్విక్!"

—అంటూ పెట్టెను అందుకున్నాడు శివాజీ. పండిట్ అతనికి సాయం పట్టాడు. వారు పెట్టెను మోసు

కుంటూ రెండు అడుగులు వేసివుంటారు.

అంతే! వారు ఏది జరుగకూడదని భావించారో, ఆ దేమేజ్ కాస్తా జరిగిపోయింది.

ఓ పెద్ద పందికొక్కుల మంద కళ్ళబడ్డారు వారు. అంతే! కీచుగా అరుస్తూ కోరలు చూస్తూ వారివైపు ఉరికాయి అవి. అంతటితో మిగిలిన పందికొక్కుల దృష్టి కూడా వారిమీదకు పడింది. అంతే! అవికూడా కీచుగా అరుస్తూ ముందుకు ఉరికాయి.

ఎగిసి వచ్చే కడలి అలలా ముంచెత్తుకు వస్తున్న ఆ పందికొక్కుల సమూహాన్ని చూసేసరికి వారి ప్రాణాలు కడ గట్టాయి.

'ఒకటీ, రెండయితే తప్పించుకోవచ్చు. కాని వేల సంఖ్యలో నున్న వాటి బారినుండి ఎలా తప్పించుకోవడం?'

ప్రాణభయంతో శక్తినంతా కూడదీసుకుంటూ పరుగెత్తుతున్నారు వారు. ఇసుకలో పాదాలు కూరుకు పోతున్నాయి. పెట్టె బరువుకు అరచేతులు మంటలు పెడుతున్నాయి. ఆయాసంతో గుండెలు ఎగిసిపడుతున్నాయి. అయినా వారు పరుగును ఆపటంలేదు.

పరుగు....పరుగు. ఒకటే పరుగు.

అయితే, వారు తమ శక్తినంతటినీ వెచ్చించి పరుగెత్తుతున్నా ఫలితం లేకపోయింది. ఆ పందికొక్కులు వారిని సమీపించాయి.

ఇప్పుడు వాటికీ, వారికీ మధ్యనున్న దూరం కేవలం కొన్ని అడుగులు. అంతే!

'అయిపోయింది! మరో ఒకటి, రెండు క్షణాలు. అంతే! అంతటితో తమ బ్రతుకులు సరి! ఆ పంది

కొక్కులు తమ శరీరాలను పీక్కుతింటూంటే, భరించలేని చిత్రవధను అనుభవిస్తూ దిక్కులేని చావు చావాల్సిందే!'

నిస్పృహాగా యెవరికి వారే అనుకుంటున్నారు వారు. అదే క్షణంలో వారిని పూర్తిగా సమీపించాయి ఆ పందికొక్కులు. ఒక వలయంలా తమను చుట్టుముడుతున్న వాటి వంక నిస్సహాయంగా చూశారు వారు.

"వుయ్ ఆర్ ఫినిష్డ్ పండిట్!" అన్నాడు శివాజీ తన స్నేహితుని చేతిని చిన్నగా నొక్కుతూ.

వారి కళ్ళల్లో లీలగా ఒక వేదనా వీచిక! అది.... తాము చనిపోతున్నామన్న బాధతో కాదు. మాతృదేశ స్వాతంత్ర్యంకోసం తాము తలపెట్టిన కార్యం తమ చావువలన మధ్యలోనే ఆగిపోతున్నందుకు.

11

అత్యంత భీకరంగా సాగుతుంది వాటి పోరాటం. కాళ్ళతో తోసుకుంటూ, డెక్కలతో రక్కుకుంటూ కోరలతో కరచుకుంటూ ఒకదానిని మరొకటి తీవ్రంగా గాయపరచుకుంటున్నాయి ఆ రెండు సీ-స్పైడర్లు.

సాగర గర్భంలో సైతం అరుదుగా కనిపించే జీవి సీ-స్పైడర్. పురాతన రాతియుగం నాటి డినోసార్స్ (సరీసృపాలు) ఒకదానికొకటి తారసపడితే చాలు వాటి మధ్య పోరాటం ప్రారంభమయ్యేదట. రెండింటిలో ఒకటి చంపబడ్డాకే వాటి పోరాటం అంతం అయ్యేది.

అలాగే ఈ సీ స్పైడర్లు కూడా. వాటి పోరాటం కొనసాగేది గంటలా? లేక రోజులా అన్నది ఇతమిద్ధంగా ఎవరూ చెప్పలేరు.

వాటి భీకర పోరాటాన్ని చూస్తూ భయంతో కంపించిపోయారు ఆ సైనికులు. ఆ పరిస్థితిలో వాటిని

దాటుకుంటూ పోయి, షిప్ శకలాల మధ్య ఆ పెట్టె కోసం గాలించడానికి వారికి ధైర్యం చాలలేదు.

అది ఆత్మహత్యా సదృశమని వారికి తెలుసు.

'ఆ జల రాక్షసిల కంటబడకుండా ఆ స్థలాన్ని వీడి వెళ్ళటం క్షేమకరం!' అనుకున్నారు వారు.

అంతే! మెల్లగా వెనుతిరిగి తమ బోట్లను చేరుకున్నారు. ఇక అప్పుడు ఏం చేయాలన్న మీమాంస బయలుదేరింది.

'ఆ సీ-స్పైడర్ల పోరాటం అంతమయ్యేవరకూ వేచియుండి, షిప్ శిధిలాలను గాలించటమా? లేక పరిస్థితిని కమేండర్‌కు చెప్పటానికి పెట్రోల్ బోట్స్ దగ్గరకు వెళ్ళటమా?'

వారు చర్చించుకుంటున్నారు.

అంతలో టప్, టప్ మంటూ చిన్న చినుకులు ప్రారంభమయ్యాయి. అప్పుడు చూశారు వారు ఆకాశం కంకా, కారు ఎనుముల మందలా ముంచెత్తుకువస్తున్న కారుమేఘాల కంకా.

"మై గాడ్! పెద్ద వర్షమే వచ్చేట్లుంది" అలజడిగా ఆ మబ్బుల వంక చూస్తూ అన్నాడొక సైనికుడు.

"వర్షమేం ఖర్మ! కుంభవృష్టే కురిసేట్లుంది" మరొకని ఉవాచ.

అంతటితో ఏం చేద్దామా అన్న చర్చకు తెరపడింది. బోట్లను వెనక్కి త్రిప్పి, పెట్రోల్ బోట్ల దగ్గరకు పోనిద్దామని అనుకున్నారు వారంతా.

అయితే వారు బోట్లను త్రిప్పి ముందుకు పోనిచ్చేలోగా అకస్మాత్తుగా ఈదురు గాలులు ప్రారంభమయ్యాయి. అంతవరకూ యెంతో ప్రశాంతంగా కనిపి

స్తున్న వాతావరణంలో ఒక్కసారిగా అనూహ్యమైన మార్పు వచ్చింది.

క్షణక్షణానికీ వేగం పుంజుకుంటున్నాయి ఈదురు గాలులు. వర్షం పెద్దదయింది. పోటు వచ్చినట్లు సముద్రపుటలలు ఉవ్వెత్తున ఎగియసాగాయి.

అలల తాకిడికి ఎగిసిపడుతున్నాయి వారి బోట్లు. పరిస్థితి ఒక్కసారిగా అంత ప్రమాదకరంగా మారేసరికి వారిలో కలవరం బయలుదేరింది.

అయితే ఆ కలవరపాటు క్షణికమే! సముద్రయానం చేసే నావికులకు ఇలాంటి ఆటుపోట్లన్నీ మామూలే! అందులో సుశిక్షితులైన సైనికులు వారు.

జాగ్రత్తగా బోట్లను కంట్రోల్ చేస్తూ, ముందుకు నడపడానికి ప్రయత్నిస్తున్నారు వారు. అయితే అలల తాకిడికి వారు అనుకున్న దిశలోగాక, మరో దిశకు కొట్టుకుపోతున్నాయి వారి బోట్లు.

ఈదురుగాలులూ, ఎగిసిపడుతున్న అలలూ వారి బోట్లను వెనక్కి నెట్టేస్తున్నా, మొక్కవోని ధైర్యంతో, తమ బోట్లను ముందుకు నడపడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు వారు.

మనిషికీ, ప్రకృతికీ మధ్య జరుగుతున్న అద్భుతమైన పోరాటం అది!

క్షణం వెనుక క్షణం గడిచిపోతుంది. అవిశ్రాంత పోరాటంతో వారి శరీరాలు అలసిపోతున్నాయి.

అంతలో ఫెటేల్మంటూ నింగి నిలువునా చీలినట్లు ఒక పెద్ద మెరుపు! దగ్గరలోనే పిడుగుపట్టు భయంకరంగా ఉరిమిన మేఘాల శబ్దం! చీకటిని చీలుస్తూ కొన్ని

క్షణాలపాటు కనుచూపుమేరలోని ప్రదేశానంతా కాంతి వంతం చేసిందా మెరుపు.

ఆ మెరుపు వెలుగులో....

12

"భగవాన్!

జీవితంలో యెప్పటికైనా తప్పనిచావు గూర్చి మేము భయపడటంలేదు. కాని, ఏం పాపం చేశామని మా నుదుట ఇంతటి నికృష్టమైన చావును వ్రాసిపెట్టావు?"

—మరో క్షణంలో ఆ పందికొక్కుల కోరలు తమ కండలను చీల్చబోతాయనగా, ఏమీ చేయలేని నిస్సహాయతతో, ఉక్రోషంగా తనలో తానే అనుకుంటున్నాడు పండిట్.

అంతలో....

ఉవ్వెత్తుగ లేచిన ఓ సముద్ర కెరటం, ఉప్పొంగి, ఉరకలు వేస్తూ, నురుగులు గ్రక్కుతూ, తీరం అంచులు దాటి ముందుకు పొంగి, పొర్లి....

ఇసుకలో నిల్చున్న శివాజీ, పండిట్‌లను నిలువెల్లా ముంచెత్తింది.

అంతే!

కెరటపు నీరు తాకిన మరుక్షణం కీసర బాసరగా అరుస్తూ, గాలికి పీడిన మబ్బుల్లా, వారిని విడిచి దూరంగా పరుగులెత్తాయి ఆ పందికొక్కులు.

ఒక్కసారిగా కడలి అల తమను నిలువెల్లా ముంచెత్తే సరికి ఉక్కిరిబిక్కిరయ్యారు వారు. చేతనాచేతనావస్థలో రెండు క్షణాల పాటు కొట్టుమిట్టు లాడారువారు.

రెండు క్షణాల తరువాత కళ్ళు తెరిచారు వారు. 'తామింకా బ్రతికే వున్నామని, తమను నిలువెల్లా ఆక్ర

మించుకున్న పందికొక్కులు. తమను విడిచి పారిపోయాయని' గ్రహించడానికి వారికి మరో రెండు క్షణాలు పట్టాయి.

అంతలో.... వారికి మళ్ళీ కీచుమంటూ వినిపించాయి కొన్ని వికృత స్వరాలు. తలలు వెనక్కుతిప్పి చూశారు వారు.

ఆ పందికొక్కుల గుంపు దూరంగా అక్కడే వుంది. కెరటంవలన ఏర్పడ్డ తడిని దాటి ముందుకు రాలేక కీచుమంటూ అరుస్తున్నాయవి. ఆ తడి ఆరిన మరుక్షణం మళ్ళీ పడతాయని గ్రహించలేని తెలివితక్కువవారు కారు వారు.

ఒక్క ఉదుటున పైకి లేచి, ప్రక్కనే పడివున్న పెట్టెను అందుకొని, సముద్రంవైపు పరుగుతీశారు వారు. కడలి అలలు కాలి పిక్కలను తాకుతుంటే తేలిగ్గా నిట్టూర్చి, ముందుకు అడుగులు వేశారు.

వారికి తెలుసు. తాము నీటిలో వున్నంతవరకూ ఆ పందికొక్కులు తమను యేమీ చేయలేవని. వారిని చూస్తూ, ముందుకు రాలేక ఒడ్డునే పరుగులుతీస్తూ కీచుగా అరుస్తోన్నాయి ఆ పందికొక్కులు.

వారు నడుస్తున్నారు. దూరంగా తీరం వెంబడి నల్లగా, బోలుగా మెరుస్తోన్న అయస్కాంత శిలలు అస్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎలిజబెత్ ముక్కలయిందీ, తమ పడవను దాచిందీ అక్కడేనని వారికి తెలుసు. అందుకే సూటిగా ఆ శిలలవంకే తమ ప్రయాణాన్ని కొనసాగించారు.

ఆకలి, నీరసం, నిస్సత్తువ వారి శరీరాలను కృంగదీస్తున్నాయి. కాళ్ళు లాగేస్తున్నాయి .... అయినా

లేని శక్తిని కూడదీసుకొంటూ ముందుకు అడుగులు వేస్తున్నారు వారు.

సుమారు అయిదారు గంటలు నిర్విరామంగా నడిచాక తమ గమ్యాన్ని చేరుకోగల్గారు వారు. ఎదురుగా బండ రాళ్ళ మధ్య క్షేమంగా వున్న తమ లైఫ్ బోటును చూసేసరికి, ఒక్కసారిగా యెంతో రిలీఫ్‌ను ఫీలయ్యారు.

బోటులో వున్న బాస్కెట్‌ను తెరచి కాసిన్ని నీళ్ళను గట గటా త్రాగారు. రెండేసి పళ్ళను తినేసరికి కాస్త శక్తి వచ్చినట్లయింది వారికి.

“ఇక వెళ్దామా?” అన్నట్లు చూసాడు శివాజీ. “ఓ!” అంటూ జేబులో నుండి చాకును తీసి బండకు కట్టిన బోటు త్రాళ్ళను కోశాడు పండిట్. శివాజీ బోటులోకి ఎక్కి కూర్చున్నాడు.

బోటును నీళ్ళలోకి తోస్తుండగా....

పండిట్ మోచేతిపై “టప్” మంటూ పడిందొక వర్షపుచుక్క. ఉలిక్కిపడ్డాడతడు. అదే క్షణంలో మరో చినుకు తన నుదిటిని తాకేసరికి, ఉలిక్కిపడుతూ చూశాడు శివాజీ.

“వర్షం వచ్చేసింది శివాజీ! ఏం చేద్దాం?” అన్నాడు పండిట్ బోటు అంచులను పట్టుకొని.

శివాజీ పెదవి విప్పేలోగా, ఒక చల్లని తెమ్మెర అతని ముఖాన్ని తాకింది. ఆ గాలి అలలలో మార్దవ్యం కన్నా, బలంపాలు ఎక్కువగా ఉన్నట్లు గమనించాడతడు. “ఈదురు గాలులు” సన్నగా గొణుక్కున్నాడతడు. నుదుటిపైకి పడిన జుట్టును వెనక్కి త్రోసుకుంటూ.

'కమ్ముకున్న కారుమబ్బులూ, వీస్తున్న ఈదురుగాలులనూ చూస్తూంటే కుంభవృష్టే కురిసేట్లుంది. ఈ స్థితిలో ఈ చిన్న లైఫ్ బోటును నమ్ముకొని ప్రయాణం కొనసాగించడం యెంతవరకూ క్షేమకరం?'

అతని ఆలోచనలతో తనకేమీ సంబంధం లేనట్లు వర్షం మొదలయింది.

వర్షం తగ్గేంతవరకూ ఆగి, తరువాత ప్రయాణం సాగించటం మంచిదేమోనని....ఓ ప్రక్క అనిపిస్తూంది. కాని షిప్ ఎలిజబెత్ కు సంభవించిన ప్రమాదం గురించి తెలిసి, బ్రిటిష్ అధికార్లు యేదైనా సెర్చింగ్ స్క్వాడ్ ను పంపితే....అప్పుడు తమ పని నూస్ లో పడుతుంది.

ఇంత శ్రమా, నిష్ఫలమౌతుంది!'

ఏం చేయాలో తోచక ఆలోచనలతో కొట్టుమిట్టులాడుతున్న శివాజీ, పండిట్ చిన్నగా అరవటంతో ఉలిక్కిపడుతూ చూశాడు.

"శివాజీ! అటు చూడు!"

—దూరంగా సముద్రంలో మిణుకు మిణుకు మంటూ వెలుగుతున్న దీపాలవంక చూపించాడు పండిట్.

అస్పష్టంగా కనిపిస్తోన్న ఆ దీపాలను చూస్తూనే, అవి పెట్రోల్ బోట్స్ అని గ్రహించారు వారు. అంత రాత్రి సమయంలో అన్ని పెట్రోల్ బోట్స్ అండోల్ దీవిని సమీపిస్తున్నాయంటే అవి ఖచ్చితంగా బ్రిటిష్ నావికాదళానికి సంబంధించినవే అయివుంటాయి.

'తన అనుమానమే నిజం అయిందా? అది బ్రిటిష్ సెర్చింగ్ స్క్వాడా? ....' శివాజీ కన్నుల్లో ఆందోళన.

అప్పటికే పండిట్ అసహనంగా చూస్తున్నాడు.

అది బ్రిటిష్ పెట్రోలింగ్ స్క్వాడో, కాదో తమకు తెలియదు. కాని వాటి కళ్ళబడి లేని రిస్కును తీసుకోవడం వారికి యిష్టం లేకపోయింది.

“కమాన్ పండిట్....! బోటును ముందుకు పోనీ! ఆ బోట్లు ఈ తీరానికి చేరకముందే మనం ఈ ప్రదేశాన్ని వీడిపోవాలి....!” ఒక నిశ్చయానికి వచ్చినట్లు దృఢ స్వరంతో అన్నాడు శివాజీ.

బోటును మరికాస్త ముందుకు త్రోసి, తను కూడా బోటులోనికి యెక్కాడు పండిట్. తెడ్లు వేయటం ప్రారంభించాడు శివాజీ. బోటు ముందుకు కదిలింది.

“వర్షం యిలాగే కురిసినా, కనీసం రేపటిలోగానైనా మనం మలబార్ తీరప్రాంతాన్ని చేరుకోగలమనుకుంటాను” అన్నాడు పండిట్.

ఔనన్నట్లు తలాడించాడు శివాజీ.

అయితే వారి అంచనాలను తారుమారు చేస్తూ కొద్దిసేపటిలోనే పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

వర్షం ఉధృతమయింది. ఆకాశం చిల్లులుపడ్డట్లుగా పెనుధారలతో కురవసాగింది వర్షం.

ఈదురు గాలుల వేగం క్షణ క్షణానికీ పెరగసాగింది. సముద్రంలో పోటు మొదలై ఉవ్వెత్తున లేచి పడసాగాయి కెరటాలు. ఆ తాకిడికి ఎగిరి ఎగిరి పడుతూ ఊగసాగింది వారి లైఫ్ బోటు.

అది మామూలు వర్షం కాదని, తుఫాన్ అని గ్రహించటం వారికి పెద్ద కష్టమేమీ కాలేదు. గ్రహించాక వారి ముఖాలు రక్తం యింకినట్లు తెల్లగా పాలిపోయాయి.

ఈ నడిసముద్రంలో పెనుతుఫాన్ మధ్య చిక్కుకున్న తాము బ్రతికి బట్ట కట్టగలమా లేదాన్నది కాదు వారి ధ్యాస. మాతృదేశ స్వాతంత్ర్యం కోసం, యిన్ని శ్రమల కోర్చి చేజిక్కించుకున్న ఆ అమూల్యమయిన సంపదను మళ్ళీ తమ దేశమాతకే అర్పించాలన్నదే వారి ఆశ....

ఆ ఆశతోనే, విలయరూపం దాల్చిన ప్రకృతితో పోరాడుతూ, తాడి ఎత్తున లేచిపడుతున్న అలలకు ఎదురొడ్డి, తమ చిన్న లైఫ్‌బోటును ముందుకు నడపడానికే విశ్వప్రయత్నం చేస్తున్నారు వారు.

అంతలో....

ఫెళ్ళుమంటూ నింగి నిలువునా చీలినట్లు ఒక పెద్ద మెరుపు! దగ్గరలోనే పిడుగు పడ్డట్లు భయంకరంగా ఉరిమిన మేఘాల శబ్దం! చీకటిని చీలుస్తూ కొన్ని క్షణాల పాటు కనుచూపు మేరలోని ప్రదేశాన్నంతా కాంతిమయం చేసిందా మెరుపు.

ఆ మెరుపు వెలుగులో....

13

ఆ వెలుగులో....

కాస్త దూరంలో అలల మధ్య అల్లల్లాడుతున్న చిన్న లైఫ్‌బోటు ఆ సైనికుల కంటబడింది. మెరిసింది క్షణమేనైనా, ఆ క్షణం సేపూ ఆ ప్రాంతాన్నంతా పట్టపగలు చేసిందా మెరుపు.

ఆ మెరుపు వెలుగులో....

ఆ చిన్న లైఫ్‌బోటులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులూ, వారిద్దరి మధ్యనున్న పెద్ద ఎర్రని పెట్టె, దాని పై కొట్టవచ్చినట్లున్న B. T. అన్న రెండు తెల్లని

అక్షరాలు....వారికి స్పష్టంగా కన్పించాయి.

ఆ బోటువంక,ఆ పెట్టెవంక అనుమానంగా చూశాడు ఆ పెర్సింగ్ స్క్వాడ్ లీడర్. ఆ బోటులోని యిద్దరు వ్యక్తులను స్పష్టంగా చూశాడతడు. 'వారు ఆంగ్లేయులు కారు, భారతీయులు. అంటే వారు ఎలిజబెత్ షిప్‌కు సంబంధించిన నావికులు కారు. కాకంటే యెవరు వారు?....'

ఆలోచిస్తున్నాడతడు.

ఆ పెట్టె....దట్ రెడ్ బాక్స్....అచ్చం ఎలిజబెత్ షిప్‌లో పంపించబడ్డ పెట్టెలాగే వుంది.

అదేనా ? అది ఆ పెట్టేనా?

ఆ పెట్టెపై చూసిన రెండు అక్షరాలు గుర్తుకు వచ్చాయి అతినికి.

"B. T." మరోసారి మననం చేసుకున్నాడతడు.

"B. T. ....బ్రిటిష్ ట్రెజరీ!" ఆనందంతో చిన్నగా అరిచాడతడు.

'యస్. సందేహం లేదు. దట్స్ ద బాక్స్!' ఉత్సాహంగా మిగిలిన సైనికులవంక చూసి, తన మనసులోని అనుమానాన్ని వివరించి, ఆ బోటును చుట్టుముట్టమని చెప్పాడు.

ఆ సైనికుల బోట్లు ప్రక్కకు తిరిగి ఆ ఒంటరి బోటును చుట్టుముట్టడానికి ముందుకు వురికాయి.

ఆ క్షణం వరకూ ప్రాణాలను ఒడ్డి ప్రకృతితో పోరాడుతున్నారు వారు. మరి కొద్ది సేపటిలో తమ పెట్రోల్ బోట్సును చేరుకోకపోతే తమ ప్రాణాలు దక్కటం కష్టమని వారికి తెలుసు. ఇప్పుడు వెనక్కు మరలి, ఆ బోటు కోసం వెళ్ళటం తమ ప్రాణాలను

రిస్క్ చేయటమేనని వారికి తెలుసు.

అయినా వారు వెనక్కి మరలారు.

ప్రాణంకన్నా కర్తవ్యం మిన్నగా భావించే సైనికులు వారు. ఏ లక్ష్యం కోసం, ఏ పెట్టెను శోధించటం కోసం తాము అంతదూరం దీవికి వచ్చారో ఆ పెట్టె కళ్ళ యెదురుగా కనిపిస్తూంటే.... దానిని వదలి ప్రాణాలకోసం పిరికిపందల్లా ఎలా వెళ్ళిపోగలరు?

ఏ క్షణమైతే మెరుపు వెలుగులో సైనికులు ఆ బోటును చూశారో.........అదే క్షణం ఆ బోటులో వున్న శివాజీ, పండిట్‌లు కూడా ఆ సైనికుల్ని చూశారు.

వారు శిథిలమయిన ఎలిజబెత్ షిప్ నుండి తప్పించుకున్న సెయిలర్లో, లేక ఆ శిథిలాలను శోధించడానికి వచ్చిన సెర్చింగ్ స్క్వాడో ...అర్థం కాలేదు వారికి.

'వారెవరైనా... వారి కంట బడకముందే ఆ ప్రదేశం నుండి దూరంగా తొలగిపోవాలి' అనుకుంటూ తమ బోటును ప్రక్కకు తిప్పాడు శివాజీ.

అప్పుడు తట్టింది అతనికి వారెవరో.

'ఎలిజబెత్‌కు ప్రమాదం జరిగి అప్పటికే చాలా గంటలయింది. అప్పుడు లైఫ్‌బోట్లపై బయలుదేరిన ఆ షిప్ సిబ్బంది ఇంతవరకూ ఇక్కడే ఎందుకుంటారు? ఈ పాటికి వారు చాలా దూరం పోయివుంటారు. అంటే, వీరు సెర్చింగ్ స్క్వాడే అయివుంటారు.'

తన అనుమానమే నిజమయినందుకు విపరీతమైన ఆందోళనతో చలించిపోయాడతడు.

అప్పటికే అర్థ చంద్రాకృతిలో తమను చుట్టుముడుతున్న ఆ సైనికులను చూసి కెవ్వున అరిచాడు పండిట్.

శివాజీ ఒక్కసారి వారివంక పరిశీలనగా చూశాడు.

పదో, పన్నెండో వుంటాయి తమను చుట్టుముట్టు తున్న బోట్లు. దాదాపు ఇరవై మంది వుంటారు ఆ బోట్ల లోని సైనికులు. వారి చేతులలోని వాటర్ గన్ లు ఆ చీకట్లో సయితం తళ తళ మెరుస్తోన్నాయి. వారంతా స్విమ్మింగ్ సూట్లలో వున్నారు.

వారిని చూస్తూ బాధగా తల విదిలించాడు శివాజీ. ఊహుఁ....లాభంలేదు. ఎట్టి పరిస్థితులలోనూ తాము వారినుండి తప్పించుకోలేరు. అయిపోయింది. ఇంత శ్రమా నిష్ఫలమయింది.

గుండెల్ని పిండేస్తున్న బాధతో ఒకరివంక ఒకరు చూసుకున్నారు వారు ఆర్తిగా.

'వీల్లేదు! తర తరాలుగా భరతమాత గళసీమను అలంకరించిన ఈ అపూర్వ ఆభరణాలు ఈ తుచ్ఛమ్లేచ్ఛుల పాల్బడి కళంకం కారాదు.

ఏది జరగరాదని, ఏ అపురూపసంపద పరాయి దేశస్థుల హస్తగతం కారాదని, ఇంతకు తెగించి, ఇంతటి వ్యూహాన్ని పన్ని, ప్రాణాల నొడ్డి మరీ తాము పోరాడారో....ఆ సంపద మళ్ళీ ఆ తెల్లదొరల పాలు కావల సిందేనా?

శోకం, ఆక్రోశం, ఆవేశం ముప్పిరిగొనగా ఓ నిర్ణయానికి వచ్చాడు శివాజీ. తన నేస్తం వంక సాభిప్రాయంగా చూశాడు.

"పండిట్! ఈ అపూర్వ సంపద మనకు దక్కని నాడు, ఈ తెల్లదొరలకు చిక్కకుండా, సాగర గర్భంలో కలియటం మిన్న.

మరో మార్గంలేదు ఫ్రెండ్!

ఈ పెట్టెను తీసుకొని సముద్రంలోనికి దూకేద్దాం. ఈ తుఫాన్‌లో పోటుమీదనున్న సముద్రంలోనికి దూకి మనకోసం ఆ సైనికులు వెతకలేరు. అయితే మళ్ళీ మనం ప్రాణాలతో బయటపడగలమనే ఆశలేదు.

పోనీ నష్టం! మన దేశ సంపద పరాయి ప్రభువుల హస్తగతం కాకుండా చేయడానికి, ఈ తుచ్ఛ ప్రాణాలను బలియిస్తే నేం?'

శివాజీ చెప్పటం పూర్తి చేయగానే, వారిద్దరూ ఆ పెట్టెను పట్టుకొని లేచి నిలబడ్డారు. వారి ప్రమేయం లేకుండానే కెరటాల వాలుకు కొట్టుకుపోతూంది వారి పడవ. ఆ సైనికుల బోట్లు క్షణక్షణానికి వారికి దగ్గర కాసాగాయి.

పండిట్ కన్నులు అరమోడ్చాడు.

"భగవాన్!

ఏవారైనా మనిషి తన ప్రాణాలను రక్షించమనే నిన్ను ప్రార్థిస్తాడు. కాని, ఈనాడు, నేను మా ప్రాణాలను భక్షించమని కోరుకుంటున్నాను.

మా ఆశయం సిద్ధించాలంటే, మా దేశ సంపద, పరాయివారి పాలు కాకూడదంటే, మాతోపాటు ఈ సంపద కూడా సాగర గర్భంలో కలసిపోవాలి! ఈ రహస్యం శాశ్వతంగా ఈ రత్నపక్షిలో నిక్షిప్తం కావాలి.

అందుకే చేతులు మోడ్చి అర్థిస్తున్నా!

ఈ సైనికులు మాకోసం, ఈ పెట్టెకోసం అన్వే షించకముందే....

విలయరూపుడవైన ఓ సముద్రుడా! ప్రళయకాల పర్జన్య, మారుతీ సహితుడవై ఉప్పొంగి, మమ్మల్ని

ముంచేశిపో!"

ఒకరినొకరు ఆర్తిగా చూసుకొని, ఒక్క ఉదుటున ఆ పెట్టెతోసహా సముద్రంలోనికి దూకేశారు వారిద్దరూ.

అదే క్షణంలో వారిని సమీపించిన సైనికులు వారి దుస్సాహసాన్ని చూసి హాహాకారాలు చేశారు.

ఆ స్క్వాడ్ చీఫ్ ఆలోచిస్తున్నాడు. 'ఏం చేయాలి? ఇప్పుడే సాగర గర్భంలోనికి ప్రవేశించి, ఆ పెట్టెకోసం అన్వేషణ సాగించాలా? లేక, ఆ స్థలాన్ని గుర్తుపెట్టుకొని, తుఫాన్ తీవ్రత తగ్గాక అన్వేషణ ప్రారంభించాలా?'

వారు ఆలోచనలో వుండగానే

అంతలో....

ఒక ప్రళయ భీకర విస్ఫోటనం! నింగి నిలువునా చీలినట్లు ఒక మెరపు! దిక్కులను పిక్కటిల్లజేస్తూ వారికి దగ్గరలోనే పడ్డ పిడుగు. ఒక మహాపర్వతాన్ని ఎత్తి సముద్రంలోనికి యెవరో విసిరేసినట్లు ఉవ్వెత్తున లేచాయి సముద్ర జలాలు.

ముత్తాడి యెత్తున లేచిన ఓ సముద్ర కెరటం, ఒక రాక్షస అల వేయి శిరస్సులనూ విప్పార్చుకొని ఊరికే ఆదిశేషునిలా పైకి లేచి వారిమీదకు విరచుకు పడింది.

అంతే!

పిచ్చుక గూళ్ళలా యెగిరిపోయాయి వారి బోట్లు. వారి ఆర్తనాదాలు ఆ పర్జన్యఘోషలో కలసిపోయాయి.

తమతోపాటుగా, ఆ అపురూప సంపద రహస్యం, కూడా శాశ్వతంగా సాగర గర్భంలో సమాధియైనందు లకు తృప్తిగా నిట్టూర్చాయి పండిట్. శివాజీల ఆత్మలు.

—:అ యి పో యి ం ది:—